# తెర

రచయిత్రి :
చుక్కల అనసూయ

"వ్రీవారు, మీ ఇంట్లోయున్న నీరజ కలిసి హాస్పిటల్లో తిరుగుతున్నారమ్మాయ్" అంటూ పక్కింటి పిన్నిగారు చెప్పినప్పటినుండి మనస్సులో తుఫాన్ చెలరేగింది గీతకు.

దానికితోడు వారిద్దరి వికవికలు, పకపకలు రోజూ మేడమీదినుండి వింటున్న నిజాన్ని, పిన్నిగారి మాటలు అబద్ధమని నమ్మలేకపోయింది. ఏదో జరగరానిదే జరిగి ఉంటుంది. లేకపోతే హాస్పిటల్ వెంబడి ఎందుకు?...... ఆలోచనలో గతం తిరగబడి ముందు నిలిచింది.

తమ పెళ్ళయి ఐదు సంవత్సరాలకు వారు తండ్రి కాబోతున్నారని తెలిసిన రోజు వారి ఆనందము అంతా ఇంతా కాదు. కాళ్ల క్రిందపెడితే కందిపోతానో అన్నట్లు అతి ప్రేమగా చూస్తుంటే, తమ దాంపత్య మాధుర్యము చవి చూస్తూ సంతోషించేది.

ఏడో నెలకు డాక్టరువద్దకు పరీక్ష చేయించుకోడానికి వెడితే, చాలా వీక్‌నెస్‌గా ఉందంటూ టానిక్, ట్యాబ్లెట్స్ వ్రాసియిచ్చి, టైము ప్రకారము మందులు తీసుకుంటె తప్ప డెలివరి సవ్యంగా జరగదని చెప్పిన రోజున అతని హడావిడి అంత ఇంతకాదు.

పై పెచ్చు కదలకుండా గాలి సవ్యంగా వచ్చేచోటు రెస్టు తీసుకోవాలి. అని డాక్టరు సలహాపైన మేడమీదికి నా బెడ్ మార్చబడింది. మరునాడే నీరజను తీసుకొచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి నా కళ్ళకు గంతలు కట్టాలని చూస్తున్నారు.

"ఒకటవుతుంది ...... హాస్పిటల్‌నుండి ఈ పాటికి వచ్చేస్తూ వుంటారు. సిగ్గులేని మనుష్యులు అనుకుంది." లేచే ఓపికలేక మోచేతిమీద లేచి మంచంమీద కూర్చుంది.

ప్రతిరోజు ఆఫీసునుండి రాగానే "మందు తీసుకున్నావా? ఇప్పుడు ఎలావుంది...?" మొన్నటిదాకా ఆ మాటలకు కరిగిపోయేది.

ఆఫీసులో ఒక్కక్షణం తీరిక లేదన్నవారు ఈ మెగారిని వెంటేసుకొని వూరంతా తిరగడానికి వచ్చింది తీరిక అబద్ధాల పుట్ట.

"మూడు నెలలలో ఎంతమార్పు?"

అతని ఆలోచనలు నా గురించి, పుట్టబోయే పాప గురించే వుండేవి. ఇప్పుడు తన చుట్టు వన్నెల విసనకర్రలా తిరుగుతున్న నీరజ చుట్టే తన ఆలోచనలు, ఆశయాలు........

వెధవ ఆలోచనలు... ..ఎంత గుర్తు తెచ్చుకోవద్దనుకొన్నా వెంబడెంబడే తరుముకొస్తూ మనస్సు పాడు చేస్తున్నవి.

శ్రీమంతము రోజు "గీతా! నీవు ఎప్పుడూ సంతోషంగానే వుండాలి." అంటూ షాపింగ్‌కు బలవంతంమీద తీసుకు వెళ్ళి బంగారు గాజులు, తనకిష్టమైన లేత గులాబి చీర కొనిపెట్టారు.

తాను చాలా అందంగా వుంటానని, ఆ చీరకు తాను కట్టుకొంటేనే అంత అందము వచ్చింది......యింకా ఎన్నెన్నో మాటలతో మురిపించారు.

శ్రీమంతము నాటి రాత్రి ఎంతసరదాగా గడిచిపోయింది. ఆ ఒక్కరోజే కాదు పెళ్ళయిన రోజునుండి సంవత్సరాలు క్షణాలుగా గడచిపోయినవి. ఆనాటి ఆదరణకు పొంగిపోయేది, ఇప్పుడు తలచుకుంటేనే మనస్సును క్రుంగదీస్తుంది.

ఇన్నాళ్లు తనతో ప్రక్క ప్రక్కనే కూర్చుని భోజనము చేసేవారము. ఒంటరిగా కూర్చుని తినాలంటే ఒంటికి పట్టేదిగాదు. ఎప్పుడైన అనారోగ్యముతో తినాలనిపించక పోతే బలవంతము మీద తినిపించేవారు. ఆయన తనని పసిపిల్లలా చూసుకుంటారని ఎంతో గర్వంగా అనుకునేది. కానీ యిప్పుడు కమ్మని మాటలు చెప్పి నా గొంతు కోయటకు కత్తి నూరుతున్నారు.

ఓ ప్రక్క నీరసం.... లేని ఓపిక కూడదీసుకుని లేవటం మనస్సును బాధించే ఆలోచనలతో తల బ్రద్దలవుతున్నట్లనిపించింది గీతకు.

* * *

"గీతా...గీతా..."

రోజూ ఆ పిలుపులోని ఆప్యాయతకు కరిగిపోతుండేది నెమ్మదిగా అయిష్టంగానే కళ్ళు తెరచింది.

"ఏమిటి అలా పడుకున్నావు; ఒంటరిగా పడుకొంటే దిగులుగా ఉందా?" కాలక్షేపానికి నీరజను ఇక్కడకు ఏల

వనా?" మంచంమీద కూర్చుంటూ అన్నాడు ప్రసాద్.... అతని కళ్ళలో ఆతృత కనిపిస్తుంది.

మనస్సులో ఒకటి...బయటకు ఎంత ప్రేమ ఒలక బోస్తున్నారు. ఇంత నేర్పుతో ఎలా నటించుతున్నారో చూడు.

అసహ్యంగా ముఖం త్రిప్పుకుంటూ "ఆమెకు తీరిక ఎక్కడుంది నా దగ్గిర కూర్చుండటానికి? నా బ్రతుక్కి ఒంటరిగానే తెల్లవారనీయి." అలా అనేసరికి గుడ్లనిండ నీరు నిండినది. తన బలహీనత బయటపడనీయకుండా చాటుగా తుడుచుకొంది.

"నిజమే గీతా. పాపం నీరజను మన యింటికి వచ్చి నప్పటినుంచి ఒక్క క్షణం తీరికలేదు. ఆ...చెప్పడము మర్చాను. అర్జంటుపనివుంది అలా బజారుకు వెళ్ళివస్తాను" అంటూ వచ్చినంత వేగంగానే క్రిందికి వెళ్ళిపోయాడు ప్రసాద్.

అర్జంటు పనట? నా కళ్ళు కప్పి ఇంకెంత నాటకమో? ఆవిడగారు ఇంతకుముందే బయటకు వెళ్ళిపోయింది. ఆఫీసు నుండి వచ్చీ రాకముందే ఈయనగారి పరుగులు సినిమాలు, షికార్లుకొట్టి ఏ రాత్రికి వస్తారో. అది వీళ్ళకు మామూలేగా.

జంటగా రోజూ వెడుతుంటే బాగుండదని ఒకరువెళ్ళిన కాసేపుకు ఇంకొకరు వెళ్ళడము...పాడు మనుషులు... పాడు బ్రతుకులు.

ఇలా కుళ్లుతూ, మూల్గుతూ ఇక్కడే వుండేకన్నా ఆయనతో పోట్లాడైనా సరే పుట్టింటికి వెళ్ళిపోవాలి అయినా నా పిచ్చిగాని వెళ్ళిపోతానంటే సంతోషంగా వెళ్ళిపొమ్మంటారుగాని, ఉండిపొమ్మని బ్రతిమాలుకుంటారా? ఇంక కొన్ని రోజులకు మెడలు పట్టి గెంటగలరు కూడా.

"ఆ సంఘటన ప్రత్యక్షంగా జరిగేకన్నా తానే తప్పుకోవడం శ్రేయస్కరము" తన కళ్ళముందు జరిగినట్లుగా గుండె పగిలినట్లు తలబరువెక్కింది గీతకు.

తెలివికి పుట్టింటికి వెడితే చిన్న పనిలి చేసు ఉండ లేను. పల్లెటూరు, ఆస్పిటల్ వసుపాయాలు లేవు. నీకేమైనా అపద కల్గితే నే బ్రతుకలేను. ఈ కష్టసమయములో నీవు వెడితే నాకు కాళ్లు చేతులాడవు. నీతో రావాలంటే ఆఫీసులో నా యమ్ముడు సెలవు ఇవ్వడు అని రెండు నెలల క్రింద అన్న మాటకు తనంత అదృష్టవంతురాలు లేదని లోలోన సంబర పడేది.

ఏమైందో...ఆ ప్రేమంతా అప్పుడుగూడా నటనేమో.

చిక్కని చీకట్లు అలుముకొన్నవి ఆ గదిలో. బెడ్ లైటయినా వెయ్యాలని చేయి సాచింది. ఈ గదిలో వెలుగు వచ్చినా తన బ్రతుక్కి రాదుగా? ఆ చాచిన చేయిని ఆ పని చేయుటకు విరమించుకొంది.

* * *

పుట్టింటికి వెళ్ళిపోతానని చెప్పాలనుకుంటూనే నాల్గు రోజులు దిగులుగా గడచిపోయినవి. దిన-దిన గండము వెయ్యేండ్లు ఆయుస్సులా గడిపివేస్తుంది గీత.

ఎలాగైనా ఈ రోజు చెప్పివేయాలి. ఈ నరకయాతన కన్న పుట్టింటిలో నైనా కాస్త నయం. నా దురదృష్టము ఎలా నడుచుకుపోతే అలా పోతాను....మనస్సులేని కాపురము, ఆయనకు ఇబ్బందే...ఎన్నాళ్ళదాక వుంటుందో ఈ మోజు అదీ చూడాలి బ్రతికివుంటే.

మేడమెట్లు ఎవరో ఎక్కివస్తున్నారు. ఇంకెవరు? వాళ్ళిందరై ఉంటారు ఈ రోజు పొద్దున నుండి ఇద్దరూ హడావిడిగా తిరుగుతూ ఉత్సాహంగా కన్పించారు. పనింటికి ఇద్దరూ కలిసి వెళ్ళారు, అందంగా ముస్తాబు చేసుకొని మరీ వెళ్ళింది ఈమెగారు. ఎందుకై వెళ్ళివుంటారు? రిజిష్టరు మారేజ్ చేసుకోను కాదుగదా? కొంపదీసి ఆఫీసుకు వెడుతున్నానని చెప్పి వెళ్ళిన సాయంత్రము వరకు రాని మనిషి ఇవ్వాళ నాల్గు గంటలతే తిరిగి రావటం!....ఇక ఆలోచనలు ముందుకు సాగనీయక ఆమె గుండెలో పరుగులెత్తుతున్న రెళ్ళ చప్పుడు నిశ్శబ్దంగా వింటూ కళ్లు మూసుకుంది.

"గీతా!...మెలుకువగానే యున్నావా? చూడు ఎవరొచ్చారో" "నీరు...నీరు ఏమిటి? సిగ్గు పడుతున్నావా? ఇలారా!" గీతకు ఓ ప్రక్క కన్నీళ్లు వస్తున్నాయి భర్త అంటోన్న మాటలకు, ఇంత పట్టపగలు ఎంత నిస్సిగ్గుగా వీధినుండి నడచుకుంటూ నా గదిలోకి వచ్చారు? అందులో నీరజను వెంటబెట్టుకొని, ఎలా పిలుస్తున్నారో చూడు. ఇప్పుడు సిగ్గు పడవలసింది తాను ఆమె కాదు.

ఏమి మాట్లాడాలో తోచలేదు. ఎప్పటి నుండో గూడు కట్టుకొన్న భయం పగిలిపోతుందనిపిస్తుంది. ఆమెను పెళ్ళి కూతురుగా చూడటంకన్న గుండె ఆగి చనిపోతే ఎంత బాగుండును అనుకొంది. అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి తల వంచుకుని నిల్చున్న నీరజను చూసి నిశ్చేష్టురాలైంది గీత.

నాజూకుగా, నర్సు యూనిఫామ్‌లో మెరిసిపోతూ దణ్ణం పెట్టింది నీరజ గీతకు.

ఓ ప్రక్క ఆశ్చర్యం...మరో ప్రక్క పెద్ద బరువు తలనుండి దించుకొన్న ఆనందం కలిసి కంగారు పెడుతుంటే కళ్ళలో నీళ్ల స్రవిస్తుంటే రెండు చేతులు ఎత్తింది గీత.

"ఏమిటి గీతా! అలా తెల్లబోయి చూస్తున్నావు. నీరు ఈ రోజునుండి బాధ్యతగల్గిన ఒక ఉద్యోగి. నీకు నర్సు పోస్టు దొరికింది. అబ్బా...దాని కొరకు ఎన్నిపాట్లు పడవలసి వచ్చిందో ఆ భగవంతునికే తెలుసు'' అన్నాడు ప్రసాద్.

కాపేపు కూచుని...నా మొట్టమొదటి కేసు మీ శ్రీమతితోనే ప్రారంభించే అవకాశము కలుగనీయండి అని వెళ్ళిపోయింది, ఆమె వెడుతూ వెడుతూ ప్రసాద్‌వైపు తల తిప్పి చూసింది. ఆ కళ్ళలో కృతజ్ఞతతో కదులుతున్న ఆనందం గీత చూసింది.

"గీతా"

నీరజ ఎవరనుకొన్నావు, స్వంత మేనత్త కూతురు. పాపం పెళ్ళయి పారాణి ఆరకముందే భర్తను భగవంతుడు ఎత్తుకపోయాడు. ఇలాంటి ఘోర పరిస్థితి ఏ ఆడదానికి సంభవించగూడదు అన్నాడు ప్రసాద్ గీతకు దగ్గరగా కూచుంటూ.

ప్రతి అభిమానవంతురాలైన స్త్రీ ఏమి చేస్తుందో నీరు అదే చేసింది. మళ్ళ పెళ్ళి పెద్దవాళ్ల చేద్దామని ఎంత ప్రయత్నించినా ఒప్పుకోక నర్సు ట్రేనింగ్ హైద్రాబాద్‌లో చేసింది. మన వూరిలో వెకెన్సి వుందని తెలిసివచ్చింది. కొత్తగాఎవ్వరిని అపాయింట్ మెంటుచేయవద్దనిబ్యానుఉన్నంటున. అంతవరకూ ఇల్లు అద్దె తీసుకుని ఉంటానని చెప్పితే నేను ఒప్పుకోలేదు. మన ఇంట్లోనే ఉద్యోగము దొరికే వరకూ ఉండాలని బలవంతంగా ఒప్పించే సరికి తలప్రాణం తోకకు వచ్చిందనుకో. తాను మా మేనత్త బిడ్డని ఎవరికి తెలియకూడదని షరతుపెట్టి మరీ వచ్చింది."

మనస్సుకు పట్టిన నల్లని మబ్బు ఒక్కొక్కటి విడిపోతుండగా మౌనంగా శాంతపడిన హృదయంతో వింటున్నది గీత.

"గీతా! నిన్ను ఈ రోజే హాస్పిటల్లో జాయిన్ చెయ్యాలి. మనకు వారం రోజులలో బుల్లి పాపాయి పుట్టబోతున్నాడు తెలుసా! ఈ సమయముననే నీవు ఉత్సాహంగా వుండాలి" అన్నాడు తిరిగి ప్రసాద్.

ఆప్యాయతగా చిలిపిగా అంటున్న ఆ మాటకు కరిగిపోతూ మాటలు వెలువడక ఉక్కిరిబిక్కిరవుతూ మౌనంగా తల వూపింది గీత.

''స్వీట్ వైఫ్!'' అంటూ బుగ్గన చిటికవేసి ఉషారుగా వెళ్ళిపోయాడు.

కళ్లు చెమరుస్తుంటే...... నిజంగానే అదృష్టవంతురాల్ని అనుకుంది. తేలిక పడిన మనస్సుతో సునాయాసంగా పురుడు పోసుకున్నట్టనిపించింది గీతకు.

కథాంజలి

(కథల మాసపత్రిక)

స్థాపితం : 1938

విడి ప్రతి...0-30 పైసలు.

సం॥ చందా : 6-00 రూ.

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాదమ్స్

బుక్‌స్టాల్సులోనూ దొరుకును